క్లుప్తంగా

బదిలీ అయిన గ్రంథాలయ అధికారికి సత్కారం



తెనాలిరూరల్: స్థానిక కొత్తపేటలోని పురపాలక సంఘ మహిళా సాధికార భవనం(పాత మహిళా మండలి)లోని గ్రంథాలయంలో అధికారిగా విధులు నిర్వహిస్తూ, పెదరావూరు బదిలీ అయిన కోడూరు అంజనీకుమారి వీడ్కోలు అభినందన సభను శుక్రవారం గ్రంథాలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై, బదిలీపై వెళుతున్న అంజనీదేవి అందించిన సేవలను ప్రశంసించారు. అదేవిధంగా కొలకలూరు నుంచి మహిళా సాధికారత భవనం గ్రంథాలయాధికారిగా బదిలీపై వచ్చిన సుజాతకు అభినందనలు తెలిపారు. మెప్మా సీఎంఎం విజయలక్ష్మి, మండల విద్యాశాఖ రిసోర్స్ పర్సన్ సీహెచ్ శ్రీదేవి, పట్నాల నాగేంద్ర, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ అలవడుతుంది

ప్రధానోపాధ్యాయురాలు కురగంటి భారతి



తెనాలిఅర్బన్: ఎన్‌సీసీలో చేరడం వలన క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుందని ప్రధానోపాధ్యాయురాలు కురగంటి భారతి పేర్కొన్నారు. కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో శుక్రవారం ఎన్‌సీసీ విద్యార్థుల ఎంపికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్‌సీసీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత విద్యలో, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వర్తించే అవకాశం ఉందన్నారు. 8,9 తరగతులు చదివే 81 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ కొడాలి గోవర్ధన్, 22వ ఆంధ్ర బెటాలియన్ అధికారులు సుబేదార్ రాజేష్‌కుమార్, హవల్దార్ చరణ్, హవల్దార్ రామన్ ఠాగూర్, గరల్స్ క్యాడెట్ ఇన్‌స్ట్రక్టర్ నవ్య, పాల్గొన్నారు.

మైనర్ బాలిక అదృశ్యం

తెనాలిరూరల్: మైనర్ బాలిక అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ మారిస్‌పేటలోని ఓ ప్రైవేట పాఠశాల, హాస్టల్‌లో ఉంటున్న 11 ఏళ్ల బాలిక కొద్ది రోజుల క్రితం అదృశ్యమైంది. దీనిపై పాఠశాల నిర్వాహకులు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు కేసు శుక్రవారం నమోదు చేశారు.

రేపు మెగా ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లి రూరల్: చినకాకాని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం మంగళగిరి శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఏషియల్ వ్యాస్కులర్ హాస్పటల్ సహకారంతో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు పూసపాటి సాయి కృష్ణ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం ఆయన వైద్య శిబిరానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. వైద్య శిబిరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందన్నారు. గ్రామ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీ సత్యసాయి భజన మండలి కన్వీనర్ డాక్టర్ రాయపాటి రామారావు, హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ వి.నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లి జెడ్పీపీ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా తెలుగు యువత పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలలో ఈ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జనసేన అధ్యక్షులు చిగురుశెట్టి రాజా రమేష్, టీడీపీ అధ్యక్షులు వంగ నరేంద్ర, లింగంశెట్టి కిషోర్, గోపాల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో రికార్డుల తనిఖీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మన గ్రోమోరు కేంద్రం, విత్తనాలు అమ్మే దుకాణం, తులసీ సీడ్స్‌లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. అంతర్ జిల్లాల తనిఖీ అధికారి వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు కె.మురళీకృష్ణ, విజిలెన్స్ సీఐ వెంకటేశ్వర్లు, ఏవో వాసంతిలు దుకాణంలోని పలు రికార్డులను పరిశీలించారు. దస్తావేజు బిల్లులు, స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు షేక్ సుభాని, ఎంపీఈవో బి.హకీంలు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి

తాడికొండ: సచివాయలంలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని.. పెండింగ్‌లో ఉన్న జీతం పీఎఫ్, ఈఎస్ఐ, కార్మికులను కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.రవి, ఎం.భాగ్యరాజ్ కోరారు. సీఐటీయూ రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సీఆర్డీయే కార్యాలయంలో శుక్రవారం వారు వినతిపత్రం అందజేశారు.

పెట్టుబడి పెట్టేవారెవరు?





కొల్లిపర మండలంలో వెద పద్ధతి ద్వారా ఎదిగిన వరి

- సాయం అందించని కూటమి ప్రభుత్వం
- రుణాలు చెల్లిస్తేనే కొత్త రుణాలంటున్న బ్యాంకులు
- పంటల బీమా సైతం రైతులే భరించాల్సిన పరిస్థితి

కొల్లిపర: రైతన్నలపై కూటమి ప్రభుత్వంలో కనికరం చూపడం లేదు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం కింద అందిస్తామన్న పెట్టుబడి సాయాన్ని రెండేళ్లుగా అందించక పోగా పంటల బీమా సైతం రైతులే చెల్లించాలని ప్రకటించడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తెనాలి నియోజకవర్గంలోని వెద పద్ధతి ద్వారా వరి నాట్లు వేసి సాగు చేస్తున్న రైతులు పెట్టుబడి సాయం కోసం బయట అప్పులు చేయాల్సిన పరిస్థితి.

పాపం.. సన్నకారు రైతులు!

బ్యాంకులు, సొసైటీల ద్వారా రుణాలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. రబీ రుణం చెల్లిస్తేనే ఖరీఫ్‌కు రుణం ఇస్తున్నారు. దీంతో అప్పు చెల్లించిన తరువాతే తిరిగి ఆయా బ్యాంకులు తిరిగి అప్పు ఇస్తున్నారు. గతంలో వడ్డీ చెల్లించి, అప్పును తిరగ రాసేవారు. సన్నకారు రైతులు ప్రస్తుతం ఆ విధానం లేకపోవడంతో అప్పు తీర్చడానికి రైతులు బయట ఎక్కువ వడ్డీకి అప్పు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. బంగారంపై రుణాల సంగతి కూడా అదే పరిస్థితి, ఏడాదిలో తిరిగి రుణం మొత్తం వడ్డీతో సహా చెల్లించాల్సి వస్తుంది.

రైతులకు తప్పని ప్రీమియం చెల్లింపు

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి రైతులకు సకాలంలో రైతు భరోసా సొమ్ము వారి ఖాతాల్లో సాగుకు ముందుగానే జమ చేశారు. రైతులకు బ్యాంకులు, సొసైటీల్లో రుణా లు త్వరితగతిన మంజూరయ్యేవి. పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించేది. ప్రస్తుతం ప్రీమియంను రైతులే చెల్లించాల్సి వస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్ పంటకు ఆగస్టు 15 లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రీమియం చెల్లించడానికి రైతు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఎకౌంటుతో పాటు, ఈ-క్రాప్ నమోదును చేసుకుని ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. దీంతో కొందరు ప్రీమియం చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. ప్రభుత్వ విధానంతో ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులు భారీగా నష్టపోయే ప్రమాదం పొంచి ఉంది.

సర్వే నెంబర్ ఆధారంగా బీమా

ప్రీమియం చెల్లించిన రైతులకు న్యాయం జరగాలంటే సర్వే నెంబర్ యూనిట్ ఆధారంగానే నష్టపరిహారం, బీమా చెల్లించాలి. గ్రామం యూనిట్‌గా చేయడం వల్ల నష్టపోయిన రైతులకు పూర్తి న్యాయం జరగదు. ర్యాండమ్ సర్వే వల్ల మరింత నష్టం జరుగుతోంది.

–కోటా చంద్రశేఖరరావు, సీఐటీయూ మండల కార్యదర్శి

ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలి

పంట బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలి. కౌలు రైతులకు ప్రీమియం చెల్లించే విధానం లేక కొందరు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వం ప్రీమియం చెల్లించినట్లుగా కూటమి ప్రభుత్వం ప్రీమియం చెల్లించి రైతుల్ని ఆదుకోవాలి. అన్నదాత సుఖీభవ సొమ్ము వెంటనే చెల్లించాలి.

–ఎ.నాగిరెడ్డి, కౌలు రైతు

రేపు కుంచవరంలో ఉచిత మెగా వైద్యశిబిరం



కరపత్రాన్ని ఆవిష్కరించిన డీఎల్ కాంతారావు

తెనాలి: గుంటూరులోని ఆంధ్ర ప్రైమ్ హాస్పటల్ సహకారంతో పట్టణానికి చెందిన 'పోస్ట్' స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన కొల్లిపర మండల గ్రామం కుంచవరంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. గ్రామంలోని శ్రీ వారాహి అమ్మవారి దేవాలయం పక్కన గల 'పోస్ట్' చారిటబుల్ ట్రస్ట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసే వైద్యశిబిరాన్ని తెనాలిలోని శ్రీవిద్యాపీఠం, పెనుగొండలోని శ్రీవాసవీ క్షేత్ర పీఠాధిపతి శ్రీప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామి) ఉదయం 9 గంటలకు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తారు.

తెనాలి పట్టణం, రూరల్ మండలం, కొల్లిపర, దుగ్గిరాల మండలాలు, లంక గ్రామాల ప్రజలకు బీపీ, షుగర్, థైరాయిడ్, ఊపిరితిత్తులు, గుండె, ఎముకలు, మెదడు, వెన్నెముక, నరాలు, మూత్ర సంబంధిత, స్త్రీల వ్యాధులు, కంటి సమస్యలు, ఫిజియోథెరపీకు సంబంధించిన వైద్యపరీక్షలను ఆంధ్రా ప్రైమ్ హాస్పటల్‌కు చెందిన నిపుణులు చేస్తారు. కన్సల్టెన్సీ, రక్తపరీక్షలు, ఈసీజీ, 2డి-ఎకో వంటి పరీక్షలను ఉచితంగా చేసి, అవసరమైన మందులను కూడా అందిస్తారని 'పోస్ట్' సంస్థ చైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు తెలిపారు. స్థానిక కాకతీయ సహకార సొసైటీ కార్యాలయంలో శుక్రవారం సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు సంబంధిత కరపత్రాన్ని ఆవిష్కరించారు. సొసైటీ డైరెక్టర్లు షేక్ ఖలీల్, డి.చక్రవర్తిచౌదరి, కఠారి వాసుదేవనాయుడు, గుర్రం హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన శ్రీ కాకతీయ రుద్రమదేవి సేవా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని మల్లెపాడు గ్రామంలోని పాథమిక పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులను శుక్రవారం పంపిణీ చేశారు. సేవా సంఘం తరపున క్యారమ్స్ పోటీలను ఆగస్టు 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సేవా సంఘం అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.హైమారావు పాల్గొన్నారు.

రేపు తెనాలిలో హరికథా భాగవతార్ సంస్మరణ

హరికథలు, పౌరాణిక పద్యనాటకం ప్రదర్శన



ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ హరికథకుడు నన్నపనేని సాంబశివరావు భాగవతార్ పదో సంస్మరణను ఆదివారం తెనాలిలో ఘనంగా నిర్వహించనున్నారు. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్న 3 గంటల నుంచి వివిధ హరికథా భాగవతార్లతో హరికథలు, పౌరాణిక పద్యనాటకంలో ఒక సీను ఉంటాయి. సభా కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేతులమీదుగా పేదకళాకారులకు ఆర్థిక సాయం అందజేస్తారు. కార్యక్రమాల ఆహ్వాన పత్రికను శుక్రవారం స్థానిక వార్ఫ్ రోడ్డులో ఆవిష్కరించారు. కార్యక్రమ వివరాలను తెలియజేశారు. ఒంగోలుకు చెందిన ఎస్.వేదవతిచే 'శ్రీకృష్ణరాయబారము' హరికథ, తిరుపతికి చెందిన పసుపులేటి శివకుమారిచే 'భక్తమార్కండేయ' హరికథ, పట్టణానికి చెందిన విన్నకోట రామకుమారిచే 'నర్తనశాల' హరికథ ఉంటాయి. రాత్రి ఏడు గంటలకు జరిగే సభకు ఆరాధ్యుల కోటేశ్వరరావు అధ్యక్షత వహిస్తారు. సభానంతరం ప్రఖ్యాత రంగస్థల నటుడు డీవీ సుబ్బారావు మనుమడు డీవీ సుబ్బారావు, షేక్ తిరమలబీచే సత్యహరిశ్చంద్ర నాటకంలోని 'కాటిసీను' ప్రదర్శిస్తారు. సాంబశివరావు కుమారులు నన్నపనేని వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, రాంబాబు పర్యవేక్షిస్తారు. ఆహ్వానపత్రిక ఆవిష్కరణలో రాంబాబుతోపాటు తోటకూర వెంకటరమణారావు, గ్యాలం వేణు, కోట అక్కేశ్వరరావు, బెజ్జంకి నాగమణి, సీహెచ్ శివపార్వతి, సీహెచ్ ఆంజనేయరాజు, శ్రీదేవి, పినపాటి సురేష్, విజయసారథి, రావినూతల ఉమానాయుడు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

తెనాలిఅర్బన్: ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. తెనాలి ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ముందు కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటివరకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. అలాగే పనికి తగిన వేతనాన్ని ఇవ్వాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు కాకుండా అనేక అవరోధాలు ఉన్నాయని, వాటిని తొలగించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ తెనాలి డివిజన్ కార్యదర్శి షేక్ హుస్సేన్ వలీ, అసోసియేషన్ నాయకులు కిరణ్‌కుమార్, శ్రీధర్, చక్రవర్తి, గోపి, దిలీప్‌కుమార్, కరిముల్లా, ప్రదీప్‌కుమార్, అశోక్, ప్రశాంతి, సునీల్‌కుమార్, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

వార్డుల కేటాయింపులో వివక్ష

సీనియర్ ఇంజినీరింగ్ అధికారికి అవమానం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ డివిజనల్ ఇంజినీరింగ్ పనిచేస్తున్న వ్యక్తిని అధికారులు అవమానించారు. కొద్దిరోజులు వరకు ఇన్‌చార్జి ఎంఈగా పనిచేసిన ఆయనకు కేవలం ఏడు వార్డులు మాత్రమే కేటాయించి మిగిలిన 33 వార్డులను ఇద్దరు డీఈలకు కేటాయించడం మున్సిపల్ కార్యాలయంలో చర్చనీయాశం గా మారింది. వివరాలోకి వెళితే.. తెనాలి పురపాలక సంఘ పరిధిలో సీనియర్ డీఈగా ఆకుల శ్రీనివాసరావు పనిచేస్తున్నారు. తెనాలి పట్టణంలోని 40 వార్డులను మూడు భాగాలుగా విభజించి అధికారులు డీఈలకు అప్పగించే వారు. వారి పరిధిలో జరిగే వివిధ రకాల అభివృద్ధి పనులను వారే పర్యవేక్షిస్తూ వచ్చేవారు. ఇతను సుమారు రెండేళ్ల నుంచి తెనాలిలో పనిచేస్తూ వచ్చారు. ఏడాది క్రితం నుంచి ఇన్‌చార్జి మున్సిపల్ ఇంజినీర్‌గా కూడా వ్యవహరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలల్లో నూతన ఎంఈ విధుల్లో చేరడంలో ఆయన డీగా కొనసాగుతున్నారు. శుక్రవారం జరిగిన వార్డుల కేటాయింపులో నూతనంగా వచ్చిన ఇద్దరు డీఈల్లో కె.శ్రీనివాసులుకు 1 నుంచి 15 వార్డులు, అంకాల శ్రీనివాసరావుకు 16 నుంచి 32వార్డులు కేటాయించారు. సీనియర్ డీఈ ఆకుల శ్రీనివాసరావుకు 33 నుంచి 40 వార్డులు మాత్రమే కేటాయించడం పలు విమర్శలకు తావిస్తుంది. ఆయన త్వరలో ఎంఈగా పదోన్నతి కూడా పొందే అవకాశం ఉంది. అలాంటి వ్యక్తిని అధికారులు కావాలని అవమానించారనే ప్రచారం పట్టణంలో జోరుగా సాగుతుంది. మొత్తం మీద వార్డుల విభజన వివాదాస్పదంగా మారిందని చెప్పవచ్చు.

ప్లాస్టిక్ రహిత తెనాలిలో భాగస్వాములు కావాలి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: ప్లాస్టిక్ రహిత తెనాలి కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని తెనాలి మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వర్ణంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వలన అనేక అనార్థాలు ఉన్నాయని, దానిని నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఉదయం మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌక్, బోసురోడ్డు, చిట్టి ఆంజనేయస్వామి గుడి వరకు అవగాహన ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, సబ్ కలెక్టర్ సంజనా సింహా, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, తహసీల్దార్ గోపాలకృష్ణ, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు పాల్గొంటారని చెప్పారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే పట్టణంలోని ప్లాస్టిక్ కవర్లు విక్రయించే వారిపై దాడులు కూడా చేయనున్నట్లు ప్రకటించారు.

- స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా బహిరంగ మల మూత్ర విసర్జనలో రాష్ట్రస్థాయిలో తెనాలికి 27వ ర్యాంకు వచ్చిందని తెలిపారు. జాతీయస్థాయిలో 547వ ర్యాంకు లభించిందన్నారు. అలాగే గార్బేజ్ కలెక్షన్‌లో కూడా ఉత్తమ ర్యాంకు లభించిందన్నారు. తెనాలి పట్టణాన్ని గ్రీన్ సిటీగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఫొటోగ్రఫీతో మధుర జ్ఞాపకాలు పదిలం



కేనన్ సంస్థ ప్రతినిధి దనిశెట్టి రాంబాబును సత్కరిస్తున్న నాయకులు

తెనాలిఅర్బన్: మధురమైన జ్ఞాపకాలను పదికాలాల పాటు పదిలంగా ఉంచేది ఫొటోగ్రఫీ అని హైదరాబాద్‌కు చెందిన కేనన్ సంస్థ ప్రతినిధి దనిశెట్టి రాంబాబు పేర్కొన్నారు. తెనాలి వీడియోగ్రాఫర్స్ అండ్ ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని ఎన్‌జీవో కల్యాణ మండపంలో కేనన్ ఎక్స్‌పోను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఫొటోగ్రఫీలోని మెళుకువలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రముఖ మోడల్స్ ఫొటోలను అందంగా చిత్రీకరించారు. అలాగే ఫొటోగ్రాఫర్ల సందేహాలను నివృతి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుద్దపల్లి సాంబశివరావు, కార్యదర్శి వి.మణికాంత్, నాయకులు సి.హెచ్. శేఖర్, మహేష్, కారుమంచి సునీల్ సందీప్, కె.గౌతమ్, ఎస్.సాయి, వాణి సుబ్రమణ్యం, రాంబాబు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు తెనాలిలో ఇళయరాజా పాటల సంగీత విభావరి



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన సాయి లక్కరాజు

తెనాలి: వివిధ భాషల్లో ఇప్పటివరకు 1,523 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించిన ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఇళయరాజా 50వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా స్వరలయ వేదిక ఆధ్వర్యంలో తెనాలిలో ఇళయరాజా సినీసంగీత విభావరిని నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకుడు సాయి లక్కరాజు వెల్లడించారు. సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఆహ్వానపత్రికను ఆయన ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. ఈనెల 20వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో సంగీత విభావరి జరుపుతున్నట్టు తెలిపారు. సత్యవర్ధన్, విష్ణుప్రియ, సాంబశివరావు, శిరీష, సత్యనారాయణలు ఇళయరాజా సంగీత దర్శకత్వం వహించిన చిత్రాల్లోని పాటలను గానం చేస్తారని తెలిపారు.

'అన్నకిల్లి' అనే తమిళ సినిమాతో ఇళయరాజా 1976 జూన్ 11న వెండితెరకు పరిచయమయ్యారని సాయి లక్కరాజు చెప్పారు. 1977లో తెలుగులోకి అనువదించిన 'భద్రకాళి' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారని తెలిపారు. సంస్థ ముఖ్యబాధ్యులు దైవాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, రమణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

గుంతలున్నాయి.. జాగ్రత్త!





స్థానిక వీఎస్సార్ కళాశాల వద్ద నుంచి డీఎస్పీ కార్యాలయానికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. విజయవాడ ప్రధాన రహదారి నుంచి డీఎస్పీ కార్యాలయం మీదుగా బాలాజీరావుపేటకు వెళ్లే వంతెన వరకు రహదారిపై ఏర్పడిన గుంతలు వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. వర్షం పడినప్పుడల్లా గుంతల్లో నీరు చేరి వాహన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని, జరుగుతున్న ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని వాహనదారులు కోరుతున్నారు. –తెనాలిటౌన్

చివలూరు వద్ద....



చివలూరు వద్ద రోడ్డుపై ఏర్పడిన పెద్ద గోతి



అంబేడ్కర్ విగ్రహం వద్ద రహదారి పరిస్థితి

గుంటూరు–హనుమాన్‌పాలెం రోడ్డులో కొల్లిపర మండల గ్రామం చివలూరు గ్రామం వద్ద ఆర్అండ్‌బీ రోడ్డు దుస్థితికి నిదర్శనం ఈ ఫొటోలు. అక్కడి చర్చి ఎదుట, అంబేద్కర్ విగ్రహం ఎదుట రోడ్డుపై వరుసగా గోతులు దర్శనమిస్తున్నాయి. వర్షం కారణంగా ఆయా గోతుల్లో నీరు నిలిచింది. భారీ వాహనాలు అదే గోతుల్లోంచి ప్రయాణం సాగిస్తున్నాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలు మెరక ఉన్న ప్రదేశంలోంచి అడ్డదిడ్డంగా ప్రయాణించాల్సిన పరిస్థితి. రాత్రివేళల్లో ఇక్కడ ప్రయాణం ప్రమాద భరితంగా తయారైంది. వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనదారులు గోతులను గమనించలేక, దగ్గరకొచ్చాక సడన్‌బ్రేక్‌లు వేస్తూ పడిపోతున్నారు. రహదారులు బాగుచేస్తామని పాలకులు చెప్పినప్పటికీ ఆచరణలో అమలుకావటం లేదు. అత్తోట వరకు రోడ్డుకు మరమ్మతులు జరిగినా శిరిపురం నుండి తూములూరు అడ్డరోడ్డు వరకు దాదాపు అయిదారు కిలోమీటర్ల రహదారి బాగును ఎవరూ పట్టించుకోవటం లేదు. ఆ మార్గంలోని చివలూరు వద్ద రోడ్డు ఘోరంగా దెబ్బతిని గోతులు పడినా అటుకేసి చూసిన వారు లేరు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టి రోడ్డు మరమ్మతులు చేయించి, ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు. – తెనాలి

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న చిన్ని తిరుపతయ్య

తాడేపల్లి రూరల్: పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపే విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య డిమాండ్ చేశారు. మంగళగిరి పట్టణ పరిధిలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతయ్య, ప్రభాకర్‌లు మాట్లాడుతూ.. ఇప్పటికే బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వీవీ జవహర్‌లాల్, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరర్యావు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, బత్తూరి మోహనరావు, బాపనపల్లి శ్రీనివాసరావు, ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు బాపనపల్లి వెంకటేశ్వరరావు, రత్నకుమార్, రవి, సీపీఎం సీనియర్ నాయకులు జేవీ రాఘవులు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ పాల్గొన్నారు.